సాక్షి పెద్దపల్లి

సోమవారం ¦ 21 ¦ ఏప్రిల్ ¦ 2025



మల్లన్నస్వామికి మొక్కులు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారికి పట్నాలు వేయించి మొక్కులు చెల్లించుకున్నారు.



పోచమ్మకు బోనం

కాల్వశ్రీరాంపూర్: గంగారంలోని గౌడకులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనంతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0/28.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రోజంతా ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. పగలు వేడిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో సోమవారం(ఈ నెల 21న) నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదివారం తెలిపారు. ప్రభుత్వం రెవెన్యూ చట్టంలో మార్పులు చేసి కొత్తగా భూభారతి ఆర్‌వోఆర్ విధానాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భూభారతిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నామని, ఇందులో జిల్లా అధికారులు అందరూ పాల్గొంటున్నారని, దీంతోనే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఆయన వివరించారు.

మే డేకు ఏర్పాట్లు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో మే డేను పోరాట దినోత్సవంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. మే డే ఉత్సవాల ప్రచార పోస్టర్‌ను జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధన కోసం తమ యూనియన్ అండగా ఉందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ 29 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్‌కోడ్‌లను అమలులోకి తేవడం ద్వారా కార్మికులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. వాటిని రద్దు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. నాయకులు భిక్షపతి, శ్రీనివాస్, జ్యోతి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న రమేశ్

పెద్దపల్లిరూరల్: జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి యువత విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పెగడ రమేశ్‌యాదవ్‌ను నియమించారు. ఈమేరకు సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన రమేశ్.. యాదవుల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారు. బీసీల్లో అత్యధిక జనాభా కలిగిన యాదవ, కురుమలు రాజకీయాల్లో రాణించేలా ప్రోత్సాహం అందించాలని రాములు సూచించారు.

27న 'మోడల్' ప్రవేశ పరీక్ష

ధర్మారం(ధర్మపురి): స్థానిక మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం ఈనెల 27న పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈనెల 21లోగా ఆన్‌లైన్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 27న ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఆరో తరగతి, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏడో తరగతి– పదో తరగతి వరకు ఖాళీ సీట్ల భర్తీకి పరీక్ష నిర్వహిస్తామని ఆయన వివరించారు. ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆయన తెలిపారు.

అడుగంటుతున్న చెక్‌డ్యామ్‌లు



అడుగంటిన నీరుకుల్ల చెక్‌డ్యాం

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): జిల్లావ్యాప్తంగా ఎండల తీవ్రత పెరుగుతోంది. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. నీరుకుల్ల, గొల్లపల్లి గ్రామాల్లోని మానేరు వాగులో నిర్మించిన చెక్‌డ్యాంల్లో గతనెలాఖరు వరకు సమృద్ధిగా నీళ్లు ఉండగా.. ఈనెలలో అడుగంటిపోయాయి. ఆయా ప్రాంతాల్లో ఇసుక తెలి కనిపిస్తోంది. వ్యవసాయ, మంచినీటి బావులు సైతం వట్టిపోతున్నాయి. ఏప్రిల్‌లోనే ఇలా ఉంటే మేలో పరిస్థితి ఎలా ఉంటుందోనని జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు.

దాహం తీర్చని చలివేంద్రం



చలివేంద్రంలో ఖాళీగా ఉన్న రంజన్లు

పెద్దపల్లిరూరల్: వేసవిలో ప్రయాణికులు, బాటసారుల దాహం తీర్చేందుకు స్వచ్ఛందంగా చలివేంద్రం ఏర్పాటు చేసిన దాతలు.. ఆ తర్వాత నిర్వహణను విస్మరించారు. ఇందుకు నిదర్శనమే కమాన్ బస్టాప్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో నీళ్లులేని రంజన్లు కనిపించాయి. చల్లనినీరు తాగేందుకు యత్నించిన పలువురు 'అయ్యో.. ఇందులో నీళ్లు లేవు' అని ఉసూరుమని కనిపించారు. ఎండలు తగ్గేవరకూ చలివేంద్రంలో చల్లనినీరు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.

ఆరబోతకు అష్టకష్టాలు



- ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు గోపమ్మ. పెద్దపల్లి మండలం నిట్టూరు స్వగ్రామం. తాను పండించిన వడ్లను ఆరబోసేందుకు తగిన స్థలంలేదు. దీంతో పొలం మడుల్లోనే ధాన్యం ఆర బోసింది.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట నుంచి కాసులపల్లికి వెళ్లే మెయిన్ రోడ్డు ఇది. కాసులపల్లి గ్రామ రైతులు పండించిన వడ్లను రోడ్డుపై ఇలా ఆరబోస్తున్నారు. రేయింబవళ్లు కాపలా కాయడం కష్టంగానే ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- పెద్దపల్లి మండలం గోపయ్యపల్లిలో రోడ్డుపై రైతులు ఆరబోసిన ధాన్యం ఇది. ఈ ధాన్యాన్ని గుర్తించకుండా వాహనదారులు ముందుకు వెళ్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అయినా, గత్యంతరం లేక ఇలా ఆరబోయాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

- 'యాసంగి ధాన్యం చేతికి వస్తోంది. కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభమయ్యాయి. కానీ, నిర్దేశిత తేమశాతం వచ్చేందుకు వడ్లు ఆరబోయాలంటే అన్నదాతలకు స్థలం లభించడంలేదు. దీంతో కొందరు రోడ్లపై, మరికొందరు పొలాల్లో ఆరబోస్తున్నారు. ఇంకా కొందరు పంట కోసిన వెంటనే రైస్‌మిల్లరుకు విక్రయిస్తున్నారు' అని కాసులపల్లికి చెందిన రైతు తిరుపతిరెడ్డి వాపోయాడు.

- వడ్లు ఆరబోసేందుకు కల్లాలు లేక అన్నదాతకు తిప్పలు
- ప్రధాన రహదారులు.. లేదంటే పొలాలే దిక్కు
- తేమశాతం కోసం రైతులకు తప్పని అగచాట్లు
- వెనువెంటనే రైస్‌మిల్లర్లకు విక్రయిస్తున్న మరికొందరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో వరి పండించిన రైతులు.. వడ్లను ఆరబోసేందుకు కల్లాలు లేక అష్టకష్టాలు పడుతున్నారు. ఈసారి యాసంగిలో సుమారు 1.98 లక్షల ఎకరాల్లో వరి సాగైందని అంచనా. దాదాపు 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

మూడేళ్లుగా కల్లాల పనుల్లేవ్..

జిల్లాలో 2021–22 ఆర్థిక సంవత్సరం వరకు ధాన్యం ఆరబోసేందుకు ఉపాధిహామీ ద్వారా కల్లాలు నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అవసరమైన మెటీరియల్ పనులకు అనుమతి ఇవ్వబోమని కేంద్రప్రభుత్వం స్పష్టం చేయడంతో పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. అప్పటికే జిల్లాలో 2,073 పనులకు అనుమతి వచ్చినా.. 139 పనులే ప్రారంభించారు. అందులోనూ 56 పనులే పూర్తయినట్లు సమాచారం. కల్లాల నిర్మాణంతో తాము స్థలం కోల్పోవాల్సి వస్తుందని రైతులు భావించడమే ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు.

మెయిన్ రోడ్లపై ధాన్యం..

రైతులు సమీపంలోని మెయిన్‌రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తున్నారు. వాహనదారులు ఆ కుప్పలను గమనించక ప్రమాదాలబారిన పడే అవకాశాలు ఉన్నాయి. నాణ్యమైన వడ్లు తేవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిబంధన విధించడంతో ఇలా ఆరబోయాల్సి వస్తోందని రైతులు అంటున్నారు.

అంతటా ఉత్కంఠ..

వరి పంట చేతికి అందే దశలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురిచేశాయి. దాదాపు 1,035 మంది రైతులు సుమారు 1,514 ఎకరాల్లో వరి పంట నష్టపోయారని వ్యవసాయాధికారుల సర్వేలో తేలింది. మొక్కజొన్నకు 1,084 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు తెలిసింది. ప్రస్తుతం వరి కోతలు ఊపందుకున్నాయి. ఈ సమయంలో ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడం రైతులను కలవరపెడుతోంది. అందుకే వీలైనంత త్వరగా వడ్లను విక్రయించాలనే ఆలోచనలతో ప్రమాదమని తెలిసినా.. రోడ్లపై వడ్లు ఆరబోస్తున్నామని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

స్థలం లేక ఇబ్బంది



వడ్లను ఆరబెట్టేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. అవసరం మేరకు కల్లాలు లేక పొలాలు, రోడ్లపై వడ్లు ఆరబోయాల్సిన పరిస్థితి ఉంది. పొలాల్లో ఆరబోసిన ధాన్యంలో మట్టిపెల్లలు వస్తున్నాయి. వాటిని తొలగించడం సమస్యగా మారింది.

– తిరుపతిరావు, రైతు, నిట్టూరు

కష్టాలు తప్పడం లేదు



విత్తనం మొదలు దిగుబడి విక్రయించే దాకా మాకు కష్టాలు తప్పడం లేదు. మద్దతు ధరకు అమ్ముకోవడం కూడా ఇబ్బందిగానే ఉంది. అందరికీ ఒకే సారి పంట చేతికి రావడంతో ఆరబోయడం ఇబ్బందిగా మారింది. ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా ఆరబోస్తున్నాం.

– కోట రాజయ్య, రైతు, పెద్దబొంకూర్

సాఫ్ట్‌వేర్ మారింది



మూడేళ్లక్రితం వరకు ఈజీఎస్‌లో కల్లాల నిర్మాణానికి అవకాశం ఉండేది. కేంద్ర ప్రభుత్వం ఈజీఎస్ పనుల సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసింది. అప్పటినుంచి కల్లాల మంజూరుకు అవకాశం లేకుండా పోయింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పనులు చేపడతాం.

– రమేశ్‌బాబు, ఏపీవో, ఈజీఎస్, పెద్దపల్లి

రామగుండం.. ఇక మహానగరం



పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, జీఎం లలిత్‌కుమార్

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని మహానగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక తిలక్‌నగర్ డౌన్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వద్ద సింగరేణి నిర్మించిన ప్రజాపార్క్‌ను ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌తో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. తిలక్‌నగర్‌వాసుల కోసం రూ.25 లక్షల వ్యయంతో పార్క్ నిర్మించిందని ఎమ్మెల్యే అన్నారు. సింగరేణి, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. సింగరేణి అధికారులు గోపాల్‌సింగ్, కిరణ్‌బాబు, వీరారెడ్డి, కర్ణ, జితేందర్‌సింగ్, వరప్రసాద్, హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, పెద్దెల్లి ప్రకాశ్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు. అనంతరం సింగరేణి ఏరియా ఆస్పత్రిలో నిర్మిస్తున్న క్యాథ్‌ల్యాబ్‌ను జీఎంతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణ, చికిత్స కోసం సింగరేణి క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు వాటర్ బాటిళ్ల పంపిణీ

మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులకు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ వాటర్ బాటిళ్లు అందజేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో స్టీల్ వాటర్ బాటిళ్లను శ్రీపాదరావు స్మారకార్థం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, మారెల్లి రాజిరెడ్డి, పెద్దెల్లి ప్రకాశ్, తిప్పారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు అప్పగించొద్దు



ర్యాలీలో పాల్గొన్న సాంబశివరావు

గోదావరిఖని: సింగరేణి సంస్థను ప్రైవేట్‌కు అప్పగిస్తే ఊరుకునేదిలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. నగరంలోని ప్రధాన వీధుల్లో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. సింగరేణిని ప్రైవేట్‌కు అప్పగించే కుట్రలు జరుగుతున్నాయని, యువ కార్మికులు సైనికుల్లాగా కదిలివచ్చి సంస్థను కాపాడుకోవాలని కోరారు. సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు కొరిమి రాజ్‌కుమార్, ఆరెల్లి పోశం, ఎల్.ప్రకాశ్, మడ్డి ఎల్లాగౌడ్, వైవీ రావు, వీరభద్రం, స్వామి, రాజరత్నం, రాంచందర్ పాల్గొన్నారు.

కాలనీలో ఘనస్వాగతం

యైటింక్లయిన్‌కాలనీ: అంతకుముందు సాంబశివరావుకు యైటింక్లయిన్‌కాలనీలో ఆర్జీ–2 బ్రాంచ్ నాయకులు ఘనస్వాగతం పలికారు. నాయకులు ప్రకాశ్, రాజారత్నం, రవీందర్, తిరుపతి, రవికుమార్, మహేందర్, నారాయణ, రమేశ్ ఉన్నారు.



ఘనంగా ఈస్టర్

ఈస్టర్ సందర్భంగా జిల్లాలోని పలు చర్చిల్లో క్రైస్తవులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈస్టర్ ప్రత్యేకత గురించి పాస్టర్లు వివరించారు. పెద్దపల్లి, గోదావరిఖని, సుల్తానాబాద్‌తోపాటు మంథని తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో మతబోధకులు ఏసుక్రీస్తు బోధనల గురించి వివరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

సింగరేణిలో ప్రీ ఫ్యాబ్రికేషన్ చెక్‌పోస్టులు

- యువ ఉద్యోగుల నియామకానికి చర్యలు
- రిటైర్డ్ సెక్యూరిటీ సిబ్బంది స్థానంలో యువతతో భర్తీ
- సంస్థ ఆస్తుల పరిరక్షణే లక్ష్యం
- అంతర్గత ఉద్యోగులకే అవకాశం



ప్రీ ఫ్యాబ్రికేషన్ చెక్‌పోస్టు

గోదావరిఖని: సింగరేణి సంస్థ ఆస్తులను కంటికి రెప్పలా కాపాడే సెక్యూరిటీ విభాగం బలోపేతంపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహించే ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలతో కూడిన ప్రీఫ్యాబ్రికేషన్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల సంఖ్య పెరిగిపోవడం, ప్రతీనెల పర్మినెంట్ సెక్యూరిటీ సిబ్బంది ఉద్యోగ విరమణ పొందుతుండటంతో చాలాఏరియాల్లో ఖాళీలు అధికంగా ఏర్పడుతున్నాయి. ఇదేస్థాయిలో ప్రైవేట్ సెక్యూరిటీతో సమానంగా పర్మినెంట్ సెక్యూరిటీ సిబ్బంది ఉండాలనే నిబంధన ప్రకారం యువ ఉద్యోగులను నియమించాలని భావిస్తోంది. త్వరలో సెక్యూరిటీ విభాగంలో అంతర్గతంగా యువ ఉద్యోగులను నియమిస్తుందని అంటున్నారు.

పదోన్నతులకు శ్రీకారం..

సింగరేణిలో సీనియర్ సెక్యూరిటీ సిబ్బందికి పదోన్నతి ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. వారికి అన్ని పరీక్షలు నిర్వహించిన సింగరేణి యాజమాన్యం.. 26 మందిని సెక్యూరిటీ జమేదార్‌లుగా ఎంపిక చేసింది. వీరికి వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా సెక్యూరిటీ పోస్టులను ఖరారు చేయనుంది. జమేదార్ నుంచి జూనియర్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను కూడా భర్తీ చేసేందుకు నిర్ణయించింది. సింగరేణి సంస్థ వ్యాప్తంగా ఇలా 12 మందిని భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది.

ఆధునిక డిజైన్లలో నిర్మాణం..

పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకునేలా రూపొందించిన ప్రీ ఫ్యాబ్రికేషన్ చెక్‌పోస్టులను తయారు చేయించడంపై సింగరేణి యాజమాన్యం ప్రత్యేకంగా దృష్టి సారించింది. వీటిలో ఇప్పటికే కొన్నినిర్మాణం పూర్తికాగా ఇంకా 56 ప్రీ ఫ్యాబ్రికేషన్ చెక్‌పోస్టులను త్వరలో పూర్తిచేయించి ఏరియాలకు పంపించనున్నారు. క్యాబిన్, టేబుల్, రెండు చెయిర్స్, ఫాల్‌సీలింగ్‌తో ఆధునిక డిజైన్‌లలో వీటిని నిర్మిస్తున్నారు.

యువతకు అవకాశం



సింగరేణి సంస్థ సెక్యూరిటీ విభాగంలోని ఖాళీల భర్తీపై దృష్టి సారించాం. ఇటీవల కారుణ్య నియామకాల ద్వారా రిటైర్డ్ కార్మికుల స్థానంలో యువకార్మికులను భర్తీ చేసేందుకు యోచిస్తున్నాం. అలాగే ఇప్పటికే పనిచేసే సెక్యూరిటీ సిబ్బందికి ఇబ్బందులు లేకుండా ప్రీ ఫ్యాబ్రికేషన్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నాం. అందులో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– సీహెచ్ లక్ష్మీనారాయణ, సెక్యూరిటీ జీఎం, సింగరేణి

స్వశక్తి సంఘాలకు చేయూత



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, పక్కన స్వశక్తి సంఘాల నేతలు

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు/జూలపల్లి(పెద్దపల్లి): స్వశక్తి సంఘాల్లోని మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత ఇస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఎలిగేడు మండలం ధూళికట్టలో ఇందిరా మహిళాశక్తి ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ కేంద్రంతోపాటు ధూళికట్ట, ముప్పిరితోట, రాములపల్లి, ర్యాకల్‌దేవుపల్లి, ఎలిగేడు, జూలపల్లి మండలం పెద్దాపూర్, తెలుకుంట, చీమలపేట, నాగులపల్లెలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా విద్యార్థుల యూనిఫాం కుట్టించి ఉపాధి కల్పిస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతును రాజు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం నాగేశ్వర్‌రావు, ఐకేపీ ఏపీఎం సుధాకర్, సీసీ మల్లేశం, మార్కెటింగ్ కమిటీ సభ్యులు బాలుసాని పరుశరాములుగౌడ్, వెంకటేశ్వర్‌రావు, నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, పోల్సాని పుల్లారావు, సింగిల్‌విండో చైర్మన్లు గోపు విజయభాస్కర్‌రెడ్డి, పుల్లూరి వేణుగోపాల్‌రావు, ఆర్‌ఐ జయలక్ష్మి, సీఈవోలు రవీందర్‌రెడ్డి, విక్రమ్, బూర్ల వెంకటసత్యం, వెంకటేశ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, బాసంపల్లి కొండయ్య, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్: కనుకుల, రామునిపల్లి, రేగడిమద్దికుంట, ఆల్లీపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్‌లు మహిపాల్‌రెడ్డి, కోట వీణ, నాయకుడు చిలుక సతీశ్, సీఈవోలు శంకరయ్యగౌడ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పరీక్షలు

రామగిరి(మంథని): సెంటినరీకాలనీలోని మంథని జేఎన్టీయూలో చేపట్టిన పలు ఉద్యోగ నియామక పరీక్షలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు మూడు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం ఫీల్డ్ అసిస్టెంట్ పరీక్షకు 100 మంది హాజరు కావాల్సి ఉండగా, 64 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం రికార్డు అసిస్టెంట్ పరీక్షకు 100 మంది హాజరు కావాల్సి ఉండగా 58 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సాయంత్రం జరిగిన అసిస్టెంట్ పరీక్షకు 100 మందికి 67 మంది అభ్యర్థులు హాజరయ్యారని అధికారులు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీబీఎస్‌ఈ' విద్యా బోధనకు ఏర్పాట్లు

- నర్సరీ – ఎనిమిదో తరగతి వరకు బోధన
- ఆ తర్వాత ఉన్నత తరగతులకు విస్తరణకు చర్యలు
- తొలుత సెక్టార్ –3 పాఠశాలలో అమలు
- దశల వారీగా సంస్థ వ్యాప్తంగా అమలు
- కార్మిక, ఉద్యోగ కుటుంబాల హర్షం
- నేటినుంచి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం



సీబీఎస్‌ఈ విద్యా బోధనకు ఎంపిక చేసిన సెక్టార్–3 సింగరేణి స్కూల్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్‌ఈ విద్యాబోధనకు అనుమతి మంజూరు కావడంతో ఈమేరకు ఏర్పాట్లు పూర్తిచేశారు. తొలుత రామగుండం –2 ఏరియాలోని యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్–3 సింగరేణి పాఠశాలను ఇందుకోసం ఎంపిక చేశారు. వచ్చే విద్యా సంవత్సరం(2025–26) నుంచి సీబీఎస్‌ఈ పద్ధతిన విద్యా బోధన చేసేందుకు అవసరమైన బోధన, బోధనేతర సిబ్బందితోపాటు ఇతర సౌకర్యాలన్నీ కల్పించారు.

సింగరేణిలోనే తొలిసారి..

సింగరేణి చరిత్రలోనే తొలిసారి యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్–3 పాఠశాలను ఎంపిక చేశారు. తొలుత నర్సరీ నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువు చెబుతారు. ఇందుకోసం ఈనెల 21(సోమవారం) నుంచి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు సుందర్‌రావు వివరించారు. పాఠశాలలో ఇప్పటికే చదువుతున్న విద్యార్థులతోపాటు ఒక్కో తరగతికి 80 మంది చొప్పున మొత్తం వెయ్యి మందికిపైగా విద్యార్థులకు సీబీఎస్‌ఈ సిలబస్‌లో ఉపాధ్యాయులు చదువు చెబుతారు. సింగరేణి కార్మికుల పిల్లలతో పాటు సింగరేణి ప్రభావిత గ్రామాల విద్యార్థులు ఇందులో చదువుకునేందుకు అర్హులని హెచ్ఎం వివరించారు. సింగరేణి సీఎండీ బలరాం ప్రత్యేక చొరవతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తక్కువ ఖర్చుతో సీబీఎస్‌ఈ విద్యను అందించడంపై కార్మికులతో పాటు కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆకుపల్లెం అదృశ్యం

- పేపర్ ప్లేట్లు ప్రత్యక్షం
- కనిపించని మోదుగాకు విస్తర్లు
- అన్ని శుభాకార్యాల్లో పేపర్ ప్లేట్లు
- పల్లె ప్రజలకు 'ఉపాధి' దూరం



గుంటపల్లిచెరువు తండాలో ఇంటికి సరిపడా విస్తర్లు కుడుతున్న గిరిజన మహిళలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల జీవన విధానంలోనూ పలు మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు ఇంట్లో జరిగే శుభకార్యాలలో మోదుగాకు విస్తర్లు విరివిగా కనిపించేవి. నేడు వాటి స్థానంలో ప్లాస్టిక్‌ప్లేట్లు వచ్చేశాయి. స్టీల్‌గ్లాసుల స్థానంలో ప్లాస్టిక్‌గ్లాసులు దర్శనమిస్తున్నాయి. మోదుగాకు విస్తర్లలో భోజనం ఆరోగ్యంతోపాటు సంతృప్తిని ఇస్తే.. ప్లాస్టిక్‌ప్లేట్లలో భోజనం అనారోగ్యాన్ని కట్టబెడుతుంది. అయినా జనం ప్లాస్టిక్ మాయలోనే ఉన్నారు. మార్కెట్‌లోకి ప్లాస్టిక్ ప్లేట్ల రాకతో మోదుగాకు విస్తర్లకు గిరాకీ పడిపోయింది. ఫలితంగా ఏటా వేసవిలో మోదుగాకు విస్తర్లు తయారు చేసే పల్లెప్రజలు నేడు ఆ పనికి దూరమయ్యారు.

పల్లెల్లో వేసవి ఉపాధి

ఏటా వేసవి మొదలుకాగానే పల్లె ప్రజలు మోదుగాకులు తెంపే పనిలో నిమగ్నమయ్యే వారు. గతంలో ఇళ్లల్లో జరిగే ఎలాంటి కార్యక్రమంలోనైనా మోదుగాకు విస్తార్లు(ఆకుపల్లెం) వినియోగించే వారు. మోదుగాకు విస్తర్లు కుట్టే వారు. వ్యవసాయ పనులు లేని ఎండాకాలంలో వీటిని విక్రయించి ఆర్థికంగా నిలదొక్కుకునే వారు. ఒక కట్టలో వంద ఆకులు ఉండేవి. ఒక కట్టను రూ.30చొప్పున విక్రయించేవారు. ఇలా వేసవిలో ఒక్కొక్కరు కనీసం రూ.5వేల నుంచి రూ.10వేలు సంపాదించేవారు. ఇలా రాజన్నసిరిసిల్ల జిల్లాలోని అటవీప్రాంతానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లోని ప్రజలకు ఎండాకాలంలో ఉపాధి లభించేది. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, గంభీరావుపేట, చందుర్తి, రుద్రంగి, ఇల్లంతకుంట మండలాల్లోని గ్రామాల్లో ఎక్కువగా విస్తరాకులు తయారు చేసేవారు కనిపించేవారు. వేసవి వచ్చిందంటే ఇంటిల్లిపాది మోదుగాకులు తెంపేందుకు ఒక బృందంగా వెళ్లేవారు. ఆకులు తెంపి, ఇంటికి తెచ్చి ఎండబెట్టి.. మళ్లీ వాటిపై నీళ్లు చల్లుతూ ఒక్కో ఆకును పేరుస్తూ సన్నటి వేపపుల్లలతో ఇస్తరాకులు కుట్టేవారు. ఇలా ఈ పని కుటుంబసభ్యులు అందరూ కలిసే చేసేవారు. ఈ పనిచేసి ఆర్థికంగా నిలదొక్కుకోవడంతోపాటు కుటుంబంలో ఐకమత్యం పెంపొందేది. ఫలితంగా ఉమ్మడి కుటుంబాలు ఆ కాలంలో ఎక్కువగా కనిపించేవి.

రంగులతో అనారోగ్యాలు

ప్లాస్టిక్‌ప్లేట్లు రంగురంగుల్లో ఆకర్షిస్తున్నాయి. ఆ రంగుల్లో వివిధ రకాలుగా హానిచేసే కెమికల్స్, మైనపు పూతలు వాడుతున్నారు. ఇవి క్రమంగా క్యాన్సర్ వంటి రోగాలకు కారణమవుతాయి. అయినా ప్రజలు రంగురంగుల ప్లాస్టిక్‌ప్లేట్లు, డిస్పోజల్ గ్లాసులపైనే ఆసక్తి చూపుతున్నారు. మోదుకు విస్తర్లు కనుమరుగు కావడంతో ప్రతి పల్లెలో చిన్న దాని నుంచి పెద్ద పెద్ద శుభకార్యాలకు ప్లాస్టిక్ ప్లేట్లు వినియోగిస్తున్నారు. ధర ఎక్కువ ఉన్నా రంగురంగుల ప్లేట్ల వాడకం తప్పడం లేదు. మోదుగాకు విస్తర్లను ఇప్పుడు కేవలం దైవకార్యక్రమాల్లోనే వినియోగిస్తుండడం గమనించాల్సిన విషయం.



మాయమైన నాటి మోదుగ విస్తర్లు



మార్కెట్లో చెలామణి అవుతున్న ప్లాస్టిక్ ప్లేట్లు

వ్యాధులు వచ్చే ప్రమాదం



ఒకప్పుడు అందరం విస్తరాకులు వాడేవాళ్లం. ఇప్పుడు ఏ వేడుకలోనైనా ప్లాస్టిక్‌ప్లేట్లు వినియోగిస్తున్నారు. వీటితో అనారోగ్యం, క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. వీలైనంతలో ప్లాస్టిక్‌ప్లేట్లు, డిస్పోజల్ గ్లాసులకు దూరంగా ఉండడం మంచిది. ప్లాస్టిక్‌తో ఉన్న అనర్థాలను గుర్తించి ఇప్పటికైనా స్టీల్‌ప్లేట్లను వాడుతూ..అనారోగ్యాలకు దూరంగా ఉండాలి.

– సత్యనారాయణస్వామి, ఎల్లారెడ్డిపేట

వేసవిలో చేతినిండా పని..



ఎండాకాలం వచ్చిందంటే చేతి నిండా పని ఉండేది. ఇంటిల్లిపాదిమి అడవికి పోయి మోదుగాకులు తెంపుకొచ్చేవాళ్లం. మ ళ్లీ ఇంటి వద్ద అందరం కలిసి వి స్తరాకులు కుట్టేవాళ్లం. ఎవరైనా పండుగ చేసుకుంటే మా దగ్గరికే వచ్చి కొనుక్కొని పోయేటోళ్లు. కానీ ఇప్పుడందరూ ప్లాస్టిక్‌ప్లేట్లే కొంటున్నారు. విస్తరాకుల కోసం ఎవరూ రావడం లేదు. ఇంటి వరకే విస్తర్లను తయారు చేసుకుంటున్నాము.

– మోతె భారతమ్మ, నారాయణపూర్

ఒకప్పుడు ఉపాధి ఉండేది



గతంలో మారుమూల తండాల్లో నివసించే గిరిజనులం మోదుకు విస్తర్లు తయారు చేసి అమ్ముకొని వచ్చిన ఆదాయంతో కుటుంబాలను పోషించుకునే వాళ్లం. మార్కెట్లోకి ప్లాస్టిక్‌ప్లేట్లు రావడంతో ఉపాధి కోల్పోయాం. మాతరం వారంతా ఇప్పటికీ మోదుకు విస్తర్లనే కుట్టుకుంటున్నాం. ఇంట్లో జరిగే శుభకార్యాలకు మోదుగు విస్తర్లనే వాడుతున్నాం. బయట మాత్రం మోదుగు విస్తర్లు కనిపించడం లేదు.

– భూక్య పీక్లీ, గుంటపల్లిచెరువు తండా

చిన్నారిని ఛిదిమేసిన కారు

- మూడేళ్ల బాలుడు మృతి
- కన్నీరుమున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు



శివరాజ్‌కుమార్ (ఫైల్)

గోదావరిఖని(రామగుండం): రెండోకాన్పు కోసం తల్లిగారింటికి వచ్చింది.. పండంటి పాపకు జన్మనిచ్చింది. అంతా సంతోషంగా ఉన్న సమయంలో ఆమె మొదటి సంతానం మూడేళ్ల బాలున్ని కారు రూపంలో మృత్యువు బలితీసుకుంది. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై భూమేశ్ కథనం ప్రకారం.. స్థానిక గంగానగర్‌లో శివరాజ్‌కుమార్(3) ఆదివారం కారు ఢీకొని మృతిచెందాడు. ముత్తారం మండలం మచ్చుపేట గ్రామానికి చెందిన పులిపాక రమేశ్ కొండగట్టు జేఎన్‌టీయూలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతడికి గంగానగర్‌కు చెందిన సంధ్యతో వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల శివరాజ్‌కుమార్ ఉండగా, సంధ్య రెండో కాన్పుకోసం తల్లిగారింటికి గంగానగర్ వచ్చింది. పాప జన్మించి మూడు నెలలు అయ్యింది. ఆదివారం కుటుంబ సభ్యులతో శివరాజ్‌కుమార్ ఆడుకుంటూ అనుకోకుండా ఒక్కసారిగా రోడ్‌పైకి రాగా, మంచిర్యాల్ నుంచి గంగానగర్‌కు వెళ్తున్న కార్ ఢీకొట్టింది. ఈప్రమాదంలో శివరాజ్‌కుమార్ మెడపై భాగంలో గాయాలయ్యాయి. స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడ నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అప్పటివరకు అందరితో ఆడుకుంటూ క్షణాల్లో మాయమైన కుమారున్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించడం అందరినీ కంటతడి పెట్టించింది.

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో గీతకార్మికుడి ఆత్మహత్య



తిరుపతి(ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): ఆర్థిక ఇబ్బందులతో శనివారం రాత్రి మండలంలోని పొత్కపల్లికి చెందిన గీత కార్మికుడు సుదగొని తిరుపతి(50) కాజీపేట్–బల్లార్షా సెక్షన్ల మధ్య సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం జీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాలు.. తిరుపతి ఏడేళ్ల క్రితం హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేశాడు. అప్పుచేసి చిన్నకూతురు వివాహం చేశాడు. అప్పులు చెల్లించక, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

అనారోగ్యంతో బాలుడు మృతి



హరిప్రసాద్(ఫైల్)

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం అల్లూరి సీతారామరాజు తండాకు చెందిన జరుపుల హరిప్రసాద్(12) అనారోగ్యంతో మృతిచెందాడు. పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి పూర్తి చేసుకున్న హరిప్రసాద్ ఇటీవలే సెలవుల్లో భాగంగా ఇంటికి వెళ్లాడు. శనివారం అనారోగ్యంగా ఉందని కుటుంబసభ్యులకు చెప్పడంతో ఆసుపత్రిలో చూపించారు. మళ్లీ ఆదివారం కడుపులో ఆయాసంగా ఉందని చెప్పడంతో మధ్యాహ్నం మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, కొద్దిసేపటికే బాలుడు మృతిచెందాడని వైద్యులు తెలిపారు.

చికిత్సపొందుతూ అంగన్‌వాడీ టీచర్..



సంధ్య(ఫైల్)

హుజూరాబాద్: పట్టణంలోని కుమ్మరివాడలో గల అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా పనిచేస్తున్న గన్నారపు సంధ్య (33) చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఈ నెల 16న సంధ్య అనారోగ్యానికి గురికాగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ట్రాక్టర్ ఢీకొని రైతు..

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని గుండ్లపల్లె గ్రామానికి చెందిన ఎడెల్లి రాజిరెడ్డి (80) ఆదివారం మధ్యాహ్నం ట్రాక్టర్ ఢీకొని మృతిచెందాడు. రాజిరెడ్డి పొలం కోస్తుండగా ఇదే గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ట్రాలీ వెనుకనుంచి ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు సమాచారం. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పొత్కపల్లి ఎస్సై రమేశ్ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు?

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపట్ల సిరిసిల్ల పట్టణానికి చెందిన యువకుడు అనుచితంగా ప్రవర్తించడంతో అతడిపై తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు అయినట్లు తెలిసింది. శనివారం యువకుడి పుట్టినరోజు సందర్భంగా స్నేహితులతో కలిసి వెళ్లి యువతి పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సమాచారం. కాగా ఈ విషయంపై తంగళ్లపల్లి ఎస్సై రామ్మోహన్‌ను వివరణ కోరగా.. కేసు నమోదైంది వాస్తవమేనని, పోక్సో చట్టం కావడంతో వివరాలు వెల్లడించలేమని తెలిపారు.

జల్సాల కోసం కిడ్నాప్ నాటకం

- డబ్బుల కోసం తండ్రికి కొడుకు బెదిరింపు మెస్సేజ్‌లు
- కట్టుకథగా తేల్చిన పోలీసులు

కోరుట్ల: జల్సాల కోసం తనకు తానే కిడ్నాప్ అయినట్లుగా నాటకమాడి పోలీసులకు దొరికిపోయిన యువకుడి ఉదంతమిది. వివరాల్లోకి వెళితే.. కోరుట్ల మండలంలోని గుమ్లాపూర్ గ్రామానికి చెందిన మందా లక్ష్మీరాజం అనే యువకుడు శనివారం నుంచి కనిపించకుండా పోయాడు. తండ్రి మందా గంగారాం ఫోన్‌కు 'మీ కుమారున్ని కిడ్నాప్ చేశామని, రూ.50 వేలు కావాలి' అని శనివారం రాత్రి మెస్సేజ్ వచ్చింది. దీంతో లక్ష్మీరాజం తల్లిదండ్రులు మందా గంగారాజం–లక్ష్మి ఆదివారం సాయంత్రం కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. లక్ష్మీరాజం కాల్ డేటా ఆధారంగా పోలీసులు హైదరాబాద్‌లో అతను ఉన్నట్టు గుర్తించి విచారించారు. జల్సాలకు అలవాటు పడిన లక్ష్మీరాజం తనకు తానే కిడ్నాప్ అయినట్లుగా కథ అల్లి తండ్రి దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసే పనికి తెరలేపినట్లు గుర్తించారు. ఆ వెంటనే హైదరాబాద్‌కు ఓ కానిస్టేబుల్‌ను పంపి మందా లక్ష్మీరాజం ఉంటున్న లాడ్జిని గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. లక్ష్మీరాజం డబ్బుల కోసం తనకు తానే కిడ్నాప్ నాటకం ఆడాడని అతన్ని అదుపులోకి తీసుకుని కోరుట్లకు తీసుకువస్తున్నట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

జేఈఈలో 366వ ర్యాంకు



అశ్రిత్‌సాయి

జ్యోతినగర్(రామగుండం): జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఎన్టీపీసీ రామగుండం టౌన్‌షిప్‌కు చెందిన నవులూరి అశ్రిత్‌సాయి 366వ ర్యాంకు సాధించాడు. టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయంలో అధ్యాపకుడికి విధులు నిర్వహిస్తున్న నవులూరి బ్రహ్మయ్య–రాధిక కుమారుడు అశ్రిత్‌సాయి జేఈఈ మెయిన్‌లో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 99.98 శాతం స్కోర్ చేశాడు. రెండో తరగతి నుంచి 10 వరకు టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయం, ఇంటర్ ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో ఓ ప్రైవేట్ కాలేజీలో చదివాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు సాధించి టాప్ ఐఐటీ కళాశాలలో విద్యనభ్యసించడమే లక్ష్యమని అశ్రిత్‌సాయి తెలిపాడు.

యాదాద్రి జిల్లాలో మామిడిపల్లివాసి మృతి



సుదర్శన్‌రెడ్డి (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన తీపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి(55) యాదాద్రి భువనగిరి జిల్లాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు తెలిసింది. మామిడిపల్లికి చెందిన తీపిరెడ్డి దేవరెడ్డి–కమలవ్వ దంపతుల కుమారుడు సుదర్శన్‌రెడ్డి కొన్నేళ్లుగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉంటున్నాడు. మావోయిస్టు, మాజీ నక్సలైట్ పేరుతో సెటిల్‌మెంట్లు, రియల్‌ఎస్టేట్, పలువురిని బెదిరించిన ఘటనలున్నాయి. కొన్నేళ్ల క్రితం గ్రామం నుంచి వెళ్లిపోయిన సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్ వెళ్లి ఆత్మరక్షణ కోసం గన్ లైసెన్స్ తీసుకున్నాడు. 2000 సంవత్సరంలో హైదరాబాద్‌లో రివాల్వర్ కొనుగోలు చేసి సెటిల్‌మెంట్లు, రియల్ ఎస్టేట్ చేసి అప్పులపాలయ్యాడు. 2024 మే లో మావోయిస్టునని సిరిసిల్లలోని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడికి ఫోన్‌చేసి డబ్బు డిమాండ్ చేయగా బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. 2024 అక్టోబర్‌లో వనపర్తి జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడికి డబ్బుల కోసం ఫోన్ చేసి పోలీసులకు చిక్కాడు. వీటితో పాటు పలు రకాల కేసులు నమోదై ఉన్నాయి. మోత్కూరు మండలం పొడిచేడు గ్రామ బస్టాండ్ పక్కన మృతిచెంది ఉన్నట్లు ఆదివారం సమాచారం అందింది. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఉండగా, కూతురు ఎంబీబీఎస్ చదువుతోంది.

కారును ఢీకొన్న లారీ.. 9 మందికి గాయాలు



ఘటన స్థలంలో క్షతగాత్రులు



నుజ్జునుజ్జయిన కారు

జగిత్యాలక్రైం: దైవ దర్శనానికి వచ్చిన భక్తులు రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఘటన ఆదివారం జగిత్యాల రూరల్ మండలంలో జరిగింది. స్థానికుల వివరాలు.. నిర్మల్ జిల్లా దివాల్‌పూర్‌కు చెందిన కడెం శ్రీరాం, ల్యాంబ్రి మున్నా, దన్నూరి ప్రణీత్, కారెపు రుషి, కడెం విశ్వంత్, భూమేశ్, రిషికరుణ్, నిమ్మల నర్సయ్య, కారే మధు ఆదివారం కొండగట్టు దైవదర్శనానికి వచ్చారు. అక్కడి నుంచి ధర్మపురి పుణ్యక్షేత్రానికి వెళ్లారు. స్వామివారి దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న లారీ, కారును ఢీకొనడంతో కారులోని 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, కొంతమంది పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. రూరల్ ఎస్ఐ సదాకర్ ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

పిచ్చికుక్క స్వైర విహారం



పిచ్చికుక్క దాడిలో గాయపడిన మహిళ

రుద్రంగి(వేములవాడ): మండలకేంద్రంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తోంది. ఆదివారం ఒక్కరోజే 11 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. మూడురోజులుగా గ్రామంలో అక్కడక్కడ పలువురిపై దాడి చేస్తూనే ఉందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అధికారులు మాత్రం ఏం పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కేశవపట్నంలో ఆదివారం తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాలు.. కేశవపట్నం గ్రామానికి చెందిన మేకల పరమేశ్ సెంట్రింగ్ పనులు చేస్తాడు. ఆదివారం మధ్యాహ్నం కొత్తగట్టులో పనికి వెళ్లాడు. రాత్రి ఇంటికి రాగా, ఇంటి వెనక తలుపులు తొలగించి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో బ్లూకోల్ట్ పోలీసులు వచ్చి పరిశీలించారు. ఇంట్లో దాచిని రూ.5వేల నగదు, మోటార్‌సైకిల్ బ్యాటరీని దొంగలు ఎత్తుకెళ్లారు. పరమేశ్ భార్య నెలరోజులుగా పుట్టింట్లో ఉంటుండగా, ఇతడు ఒక్కడే ఇంటి వద్ద ఉంటున్నాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ముస్తాబాద్: మండలంలోని బందనకల్ వద్ద అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. సిద్దిపేట జిల్లా ఇబ్రహీంపూర్‌కు చెందిన బండి అంజనేయులు బందనకల్ నుంచి ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్ యజమాని హరీశ్ పరారీలో ఉండగా, డ్రైవర్ అంజనేయులును రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధాన్యం ట్రాక్టర్ బోల్తా

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని వంకాయగూడెం గ్రామశివారులో ఆదివారం ధాన్యం ట్రాక్టర్ బోల్తాపడింది. హుజూరాబాద్ మండలం కందుగల గ్రామం నుంచి వరిధాన్యాన్ని మానకొండూర్‌లోని సీడ్‌ప్లాంట్‌కు తరలిస్తుండగా ట్రాక్టర్ టైర్‌కు పంక్చర్ అయి బోల్తాపడింది.

మోసం చేసిన వ్యక్తి పరార్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): విదేశాలకు వెళ్లేందుకు వీసాలు ఇప్పిస్తానని పలువురిని మోసం చేసిన తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ మహబూబ్ పరారీలో ఉన్నాడు. ఇటీవల సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పోతారం గ్రామానికి చెందిన బోడ శ్రీనివాస్‌రెడ్డి (40) రూ.4 లక్షలు మహబూబ్‌కు ముట్టజెప్పాడు. కానీ, అతడిని విదేశాలకు పంపలేదు. దీంతో శ్రీనివాస్‌రెడ్డి సూసైడ్‌నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కన్నపేట పోలీసులు సారంపల్లికి రావడంతో అప్పటికే మహ్మద్ మహబూబ్ పరారయ్యాడు. అయితే ఇతడిపై పలు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో వీసా మోసం కేసులు నమోదైనట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

రాజేశుడా రక్షించు



వేములవాడ: రాజేశుడా రక్షించు స్వామి అంటూ వేములవాడ రాజన్నను ఆదివారం 45వేల మంది భక్తులు దర్శించుకున్నారు. మండుతున్న ఎండలను లెక్కచేయకుండా కుటుంబ సమేతంగా తరలివచ్చారు. ధర్మగుండంలో స్నానాలాచరించి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. ఆలయ ఆవరణలో నిలువెత్తు బెల్లం పంపిణీ, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.





అన్నదాతపై హమాలీ భారం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసి మోపెడవుతున్న ఖర్చులు
- క్వింటాల్‌కు రూ.55 చెల్లిస్తున్న రైతులు
- 2017కు ముందు క్వింటాల్‌కు రూ.5.30 ఇచ్చిన ప్రభుత్వం
- తర్వాత చేతులెత్తేసిన సర్కార్
- ప్రభుత్వమే చెల్లించాలంటున్న రైతులు



ఇటీవల వీణవంకలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

వీణవంక(హుజూరాబాద్): ఆరుగాలం శ్రమించి పండించిన ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే హమాలీ లోడింగ్ ఖర్చు రైతులకు తడిసి మోపెడవుతుంది. కొన్ని గ్రామాల్లోని కేంద్రాల్లో హమాలీలకు ఒక్కో బస్తాకు (40కిలోలు) రూ.20 నుంచి రూ.25 రైతులు ఇస్తుండగా, మరికొన్ని ప్రాంతాలలో క్వింటాల్‌కు రూ.60 ఇస్తున్నారు. గతంలో హమాలీ చార్జి ప్రభుత్వమే చెల్లించేది. దీంతో అన్నదాతపై కొంత భారం తగ్గేది. కానీ, 2017 రబీ సీజన్ నుంచి ప్రభుత్వం చేతులెత్తేసింది. మద్దతు ధర క్వింటాల్‌కు గ్రేడ్ ఏ రూ.2,320, కామన్ రకం రూ.2,060 ఉండగా, ఇందులో హమాలీలకు రూ.60 రైతులే చెల్లిస్తుండగా, మిల్లుల వద్ద దిగుమతి చేసేందుకు క్వింటాల్‌కు రూ.2 చొప్పున ఇస్తున్నారు. ధాన్యం తరలించేందుకు టన్నుకు రూ.200 చొప్పున ప్రభుత్వం ఇస్తుంది. కానీ ట్రాక్టర్ యజమానులకు గిట్టుబాటు కాకపోవడంతో రైతుల వద్ద అదనంగా మరో రూ.100 తీసుకుంటున్నారు.

ఊపందుకున్న కోతలు

కరీంనగర్ జిల్లావ్యాప్తంగా వరి కోతలు ఊపందుకున్నాయి. ఈ యాసంగిలో నాట్లు వేసిన వారం నుంచి మొగిపురుగు ఆశించి రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. పంటను కాపాడుకునేందుకు రసాయన మందులు వాడారు. ఎకరాకు రూ.30వేల పెట్టుబడి పెట్టగా దిగుబడి అంతంతే వస్తుందని రైతులు వాపోతున్నారు. యాసంగిలో 2.60లక్షల ఎకరాల్లో వరి సాగులోకి వచ్చినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు 80వేల ఎకరాల్లో కోతలు కోశారు. జిల్లావ్యాప్తంగా 249 కేంద్రాలను అధికారులు కేటాయించగా కొన్ని ప్రాంతాల్లో సెంటర్లు ప్రారంభమయ్యాయి. కాగా, ఇప్పటికే హమాలీలు సమావేశాలు నిర్వహించుకొని 20శాతం ధరలు పెంచేందుకు నిర్ణయించుకున్నారు.

చేతులెత్తేసిన ప్రభుత్వం

గతంలో క్వింటాల్‌కు రూ.5.30 చొప్పున ప్రభుత్వం హమాలీలకు చెల్లించేది. మిగిలిన డబ్బులు రైతులు కలుపుకొని ఇచ్చేవారు. దీంతో అన్నదాతలకు కొంత ఊరట లభించేది. 2017 నుంచి ప్రభుత్వం చేతులెత్తేయగా, అప్పటి నుంచి రైతులపై భారం పడుతుంది. హమాలీలు ధాన్యం ఎత్తడం, తూకం వేయడం చేయాలి. కానీ కొన్ని గ్రామాల్లో కేవలం తూకం మాత్రమే వేస్తున్నారు. దీంతో ధాన్యం ఎత్తడం రైతులకు ఇబ్బందిగా మారింది. ధాన్యం ఎత్తడం కోసం అదనంగా బస్తాకు రూ.8 కూలీలకు ఇవ్వాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. పెరిగిన పెట్టుబడులకు మద్దతు ధర సరిపోతలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖ మంత్రి చొరవ తీసుకొని హమాలీ చార్జీలు పూర్తిగా ప్రభుత్వమే భరించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వమే చెల్లించాలి

రెండెకరాల్లో దొడ్డురకం వరి సాగు చేస్తే రెండు రోజుల క్రితం కోత కోసిన. వాతావరణ మార్పులు, తెగుళ్లతో ఈసారి ఆశించిన దిగుబడి వచ్చేలా కనిపిస్తలేదు. ఎకరాకు రూ.25వేల పెట్టుబడి పెట్టిన. హమాలీలకు ప్రభుత్వం చెల్లిస్తే కొంత భారం తగ్గుతుంది. ప్రభుత్వం కలుగజేసుకొని భారం తగ్గించాలి.

– సంపత్, రైతు, వీణవంక